సాక్షి తిరుపతి

మంగళవారం । 11 । మార్చి । 2025



**పోలీస్ గ్రీవెన్స్‌కు 102 అర్జీలు**

పోలీస్ గ్రీవెన్స్‌కు జిల్లా నలుమూలల నుంచి మొత్తం 102 అర్జీలు వచ్చినట్టు ఎస్పీ హర్షవర్ధన్‌రాజు తెలిపారు. - 8లో



**పోటెత్తిన అర్జీలు**

కలెక్టరేట్‌కు సోమవారం అర్జీదారులు పోటెత్తారు. వివిధ సమస్యలపు తరలివచ్చి అర్జీలు సమర్పించారు. - 8లో




## న్యూస్‌రీల్

### దుగరాజుపట్నం పోర్టు నిర్మాణం అంతేనా?

- పార్లమెంట్‌లో గళమెత్తిన ఎంపీ గురుమూర్తి



**తిరుపతి మంగళం :** తిరుపతి పార్లమెంటు పరిధిలోని దుగరాజపట్నం పోర్టు నిర్మాణ పరిస్థితి ఏంటని తిరుపతి ఎంపీ డాక్టర్ మద్దిల గురుమూర్తి కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీశారు. సోమవారం లోక్ సభలో ఆయన మాట్లాడారు. 2014 పునర్వ్యవస్థీకరణ చట్టంలో పేర్కొన్న దుగరాజపట్నం నౌకాశ్రయ అభివృద్ధి ఇంకా ప్రారంభం కాలేదన్నారు. 2018 నాటికే మొదటి దశ నిర్మాణం పూర్తి కావాల్సి ఉందన్నారు. దీనిని తక్షణమే ప్రారంభించి, రాష్ట్ర సముద్ర వాణిజ్య అభివృద్ధిని వేగవంతం చేయాలని కోరారు. ఆధునిక సాంకేతికతను సద్వినియోగం చేసుకోకపోవడం లోపంగా కనిపిస్తోందన్నారు. ఈ-బిల్స్ ఆఫ్ లేడింగ్ అమలు చేయడం ద్వారా సముద్ర రవాణా మెరుగుపడుతుందని గుర్తుచేశారు.

### 2 నుంచి డీడీఈ పరీక్షలు నిర్వహించండి

**తిరుపతి సిటీ:** ఎస్వీయూ డీడీఈ పరీక్షలను వచ్చే నెల 2వ తేదీ నుంచి నిర్వహించాలని వర్సిటీ అధికారులను హైకోర్టు ఆదేశించింది. ఇప్పటికే పలు మార్లు వాయిదా పడిన పరీక్షలను ఈ నెల 17వ తేదీ నుంచి నిర్వహించాలని కోర్టు గతంలో ఆదేశాలు జారీచేయగా, పదో తరగతుల నేపథ్యంలో పరీక్షలను నిర్వహించలేమని వర్సిటీ అధికారులు కోర్టుకు విన్నవించారు. అన్ని విషయాలను పరిశీలించిన ధర్మాసనం ఈ మేరకు షెడ్యూలు విడుదల చేయాలని అధికారులను ఆదేశించింది.

### రేపటి నుంచి ఏపీఈసెట్‌కు దరఖాస్తులు

**తిరుపతి సిటీ:** ఏపీ ఈసెట్-2025 నోటిఫికేషన్ విడుదలైంది. బుధవారం నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించనున్నారు. బీటెక్ కోర్సులో రెండవ ఏడాదిలో నేరుగా ప్రవేశం పొందేందుకు నిర్వహించే ఏపీఈసెట్‌కు వచ్చేనెల 7వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని అధికారులు ప్రకటించారు. ఇంజీరింగ్ అండ్ టెక్నాలజీలో డిప్లొమో, బీఎస్సీ (గణితశాస్త్రం)లో డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతున్న, పూర్తి చేసిన అభ్యర్థులు ఏపీఈసెట్ పరీక్షకు అర్హులని తెలిపారు. ప్రవేశ పరీక్ష మే 6వ తేదీన నిర్వహించనున్నారు.

### ఈకేవైసీకి 18 వరకు గడువు

**తిరుపతి అర్బన్:** ఈకేవైసీ చేయించుకోవడానికి రైతులకు ఈ నెల 18వ తేదీ వరకు గడువు ఉందని జిల్లా వ్యవసాయశాఖ అధికారి ప్రసాద్‌రావు సోమవారం తెలిపారు. రబీ సీజన్‌కు సంబంధించి 2,03,860 ఎకరాలకు చెందిన 72,966 మంది రైతులకు ఈ పంట నమోదు చేశామని చెప్పారు. అలాగే 1,94,696 ఎకరాలకు సంబంధించి 69,166 మంది రైతులకు ఈకేవైసీ చేయాల్సి ఉందని వెల్లడించారు. 18వ తేదీ వరకు చేయించుకున్న వారి జాబితాను ఈనెల 22న ప్రకటిస్తామని తెలిపారు.

### కురుణామయుడా.. కనికరించు!



వెస్ట్ చర్చిలో ప్రార్థనలు చేస్తున్న వెటర్నరీ జూడాలు

**తిరుపతి సిటీ:** గౌరవవేతనం పెంచాలంటూ గత 36 రోజులుగా పశువైద్య విద్యార్థులు తరగతులు బహిష్కరించి వినూత్న రీతిలో నిరసనలు వ్యక్తం చేస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం స్థానిక వెస్ట్ చర్చిలో వెటర్నరీ జూడాలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. వారు మట్లాడుతూ నెల రోజులకు పైగా ఆకలి కేకలతో ధర్నాలు, నిరసనలు చేస్తున్నా అధికారులు, ప్రభుత్వం తమ న్యాయమైన డిమాండ్‌పై స్పందించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్య పరిష్కారమయ్యే వరకు సమ్మె విరమించేది లేదని హెచ్చరించారు.

### వేదవిజ్ఞానానికి ప్రత్యేక వెబ్‌సైట్



**తిరుపతి సిటీ:** వేద విజ్ఞానాన్ని డిజిటలైజేషన్ చేసి ప్రపంచానికి అందించేందుకు వేదం.ఓఆర్‌జీ పేరుతో ప్రత్యేక వెబ్‌సైటన్‌ను జాతీయ సంస్కృత వర్సిటీలో అధికారులు లాంఛనంగా ప్రారంభించారు. వర్సిటీలో ఖండనఖండఖాద్య గ్రంథాధ్యయనంపై పది రోజుల పాటు జరగనున్న అంతర్జాతీయ వర్కషాపులో భాగంగా ఈ వెబ్‌సైట్‌ను ప్రారంభించారు. శ్రీసత్యసాయి వేదప్రతిష్ఠానం, న్యాసీ ప్రబంధకులు రిటైర్డ్ ఐఏఎస్ అధికారి కేఆర్ పరమహంస, వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి, డీన్ రజనీకాంత్ శుక్లా, ప్రొఫెసర్ గణపతి భట్, అధ్యాపకులు సతీష్, నాగరాజు భట్, మనోజ్‌షిండే, శివరామ దాయగుడే పాల్గొన్నారు.



సిబ్బంది లేని చిట్టమూరు మండలంలోని ఆరూర్ సచివాలయం



ఖాళీగా వరదయ్యపాళెంలోని సీఎల్ఎన్‌పల్లి గ్రామ సచివాలయం

# సర్వేజనం.. సేవా భంగం

'క్షేత్ర స్థాయిలోనే సమస్యలు పరిష్కరించాలి. ఉద్యోగులు సైతం ప్రజలకు అందుబాటులో ఉండాలి. ఎక్కడి సమస్యలు అక్కడే పరిష్కారమవ్వాలి..' అన్న లక్ష్యంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సచివాలయ వ్యవస్థకు శ్రీకారం చుట్టింది. ఇది ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా మారింది. కూటమి ప్రభుత్వం వచ్చాక మహాత్మా గాంధీ కలలకు తూట్లు పొడుస్తోంది. సచివాలయ వ్యవస్థను నిర్వీర్యం చేస్తోంది. సర్వేల పేరుతో సిబ్బందిని ముప్పుతిప్పలు పెడుతోంది. చిన్న సమస్యకూ ప్రజలు సుదూర ప్రాంతంలోని కలెక్టరేట్‌కు పరుగులు పెట్టేలా చేస్తోంది. ఏం చేయాలో తెలియక.. తమ బాధలు ఎక్కడ చెప్పుకోవాలో అర్థంగాక జనం నలిగిపోవాల్సిన దుస్థితి ఏర్పడింది.

**సచివాలయాలు వెలవెల**

- మహాత్మా గాంధీ కలలకు కూటమి నేతల తూట్లు
- చిన్న సమస్యలకూ కలెక్టరేట్‌కు పరుగులు
- క్షేత్ర స్థాయిలో ఎక్కడి సమస్యలు అక్కడే
- ఆపసోపాలు పడుతున్న ప్రజలు

**తిరుపతి అర్బన్:** సచివాలయ వ్యవస్థకు కూటమి నేతలు తూట్లు పొడుస్తున్నారు. సర్వేల పేరుతో సిబ్బందిని ప్రజలకు దూరం చేస్తున్నారు. ఇంటి వద్దే అందుతున్న సేవలను అందకుండా అడుగడుగునా అడ్డుపడుతున్నారు. ఫలితం చిన్న సమస్యకూ విధిలేని పరిస్థితుల్లో కలెక్టరేట్‌కు వెళ్లాల్సి వస్తోందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాగునీరు, వీధిలైట్లు, దారి సమస్య, సర్టిఫికేట్స్, రేషన్‌కార్డులు, ఫించన్లు, పాఠశాలల్లో కొళాయిల మరమ్మతులు ఇలా.. అన్నింటికీ కలెక్టరేట్‌కు వెళ్తున్నారు. కూటమి ప్రభుత్వంలో 2024 డిసెంబర్ 2వ తేదీ కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికకు 82 అర్జీలు వచ్చాయి. ప్రస్తుతం మార్చి 10వ తేదీ ఆ అర్జీల సంఖ్య 265కి చేరింది. మూడు రెట్లు అర్జీలు పెరిగాయి. రాబోవు రోజుల్లో ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది.



కలెక్టరేట్‌లో బారులు తీరిన అర్జీదారులు

**రేషన్ కార్డు కోసం వచ్చాం**



నా పేరు పీ.నాగయ్య. నా భార్యపేరు పీ.మురగమ్మ. మాది వడమాలపేట మండలంలోని బట్టికండ్రిగ గ్రామం. మాకు రేషన్ కార్డు లేదు. సచివాలయానికి వెళితే అక్కడ ఎవ్వరూ ఉండడం లేదు. దీంతో మూడు వారాలుగా అన్ని పనులు వదులుకుని కలెక్టరేట్‌కు వస్తున్నాం. మేము చాలా పేదవాళ్లం. మాకు రేషన్ కార్డు ఇప్పించాలని కోరుతున్నాం.

**జిల్లా సమాచారం**

| | |
|---|---|
| సచివాలయాలు | 619 |
| సచివాలయ ఉద్యోగులు | 7,405 |
| రూరల్‌లో సచివాలయాలు | 495 |
| సచివాలయ ఉద్యోగులు | 5,445 |
| అర్బన్ పరిధిలో సచివాలయాలు | 196 |
| సచివాలయ ఉద్యోగులు | 1,960 |

**పీఎంజేఏవై కార్డు కోసం తిరుగుతున్నా**



నా పేరు గూడూరు అయ్యప్ప. నా కుమారుడు గూడూరు దయాకర్ 5వ తరగతి చదువుతున్నాడు. పదేళ్ల వయస్సులోనే గుండె సమస్యతో బాధపడుతున్నాడు. ఆస్పత్రులకు వెళితే పెద్ద మొత్తంలో ఖర్చవుతుందని చెప్పారు. పీఎంజేఏవై కార్డు ఉంటే ఉచితంగా ఆపరేషన్ చేస్తామని చెప్పారు. గతంలో ఈ కార్డును సచివాలయ పరిధిలోనే ఇచ్చేవారు. ప్రస్తుతం వారు ఇవ్వడం మానుకున్నారు. దీంతో రెండు వారాలుగా పీఎంజేఏవై కార్డు కోసం కలెక్టరేట్ చుట్టూ తిరుగుతున్నా.

**వికలాంగుల పింఛన్ కోసం వచ్చా**



నాది తిరుపతిలోని చింతలచేను. నా పేరు పీ.మంగమ్మ. నా భర్త పేరు వెంకటేష్. వికలాంగుల పింఛన్ కోసం కలెక్టరేట్‌కు వచ్చాం. సచివాలయంలో ఎవ్వరూ అందుబాటులో లేరు. మేము కటిక పేదవాళ్లం. దానికితోడు వికలాంగురాలుని. పింఛన్‌కు అర్హత ఉంది. న్యాయం చేయాలి.

**పింఛన్ ఇవ్వడంలేదయ్యా!**



నా పేరు కోనేటి రోసయ్య. మాది కేవీబీ పురం మండలంలోని కోవనూరు ఎస్టీకాలనీ. వృద్ధాప్య పింఛన్ కోసం తిరుగుతున్నా. రెండు వారాలుగా కలెక్టరేట్‌కు వస్తున్నా. మా గ్రామం నుంచి కలెక్టరేట్‌కు రావాలంటే 70 కి.మీ. మా కష్టాన్ని గుర్తించాలి.

# అద్వితీయం!



విజేతలతో వీసీ, రిజిస్ట్రార్

**ఎస్వీయూ చరిత్రలో మరో మైలురాయి**

- జాతీయ యువజనోత్సవంలో ఎస్వీయూకు ద్వితీయ స్థానం
- అన్నిరంగాల్లో యువతను ప్రోత్సహించడమే వర్సిటీ లక్ష్యం
- మీడియాతో వీసీ, రిజిస్ట్రార్

**తిరుపతి సిటీ:** ఎస్వీయూ మరో మైలురాయిని దాటిందని వర్సిటీ వీసీ సీహెచ్ అప్పారావు ఆనందం వ్యక్తం చేశారు. జాతీయ యువజనోత్సవాల్లో విశేష ప్రతిభకనబరిచి వర్సిటీకి దేశంలోనే ద్వితీయ స్థానం సాధించిపెట్టిన విద్యార్థులను చూసి వర్సిటీ గర్వపడుతోందన్నారు. సోమవారం వీసీ చాంబర్‌లో ఆయన రిజిస్ట్రార్ భూపతినాయుడుతో కలసి మీడియాతో మాట్లాడారు. ఉత్తరప్రదేశ్‌లోని అమితి వర్సిటీ వేదికగా జాతీయ స్థాయిలో జరిగిన యువజనోత్సవాల్లో దేశ వ్యాప్తంగా సుమారు 148 యూనివర్సిటీల నుంచి 2,400 మంది విద్యార్థులు పోటీపడ్డారని తెలిపారు. ఎస్వీయూ నుంచి ఐదు విభాగాలలో పోటీపడి విద్యార్థులు సత్తా చాటారని తెలిపారు. ఫైనార్ట్స్ విభాగంలో ఓవరాల్ ద్వితీయ చాంపియన్‌గా వర్సిటీ నిలవడం గర్వంగా ఉందన్నారు. అకడమిక్ విద్యతో పాటు క్రీడలు, ఫైనార్ట్స్ వంటి అన్ని రంగాల్లోనూ వర్సిటీ విద్యార్థులను ప్రొత్సహిస్తోందని పేర్కొన్నారు. ఇంతటి విజయానికి కృషి చేసిన డాక్టర్ పత్తిపాటి వివేక్, ప్రొఫెసర్ మురళీధర్‌ను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఈ సమావేశంలో డాక్టర్ పాకనాటి హరికృష్ణ, శరత్ బాబు, ప్రసన్న కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

**వర్సిటీకి రుణపడి ఉంటా**



ఎస్వీ మ్యూజిక్ కళాశాలలో డిగ్రీ చేస్తున్నా. జాతీయ స్థాయి యువజనోత్సవాల్లో పాల్గొనే అవకాశం ఇచ్చిన ఎస్వీయూకు రుణపడి ఉంటా. జాతీయ స్థాయిలో రంగోళి విభాగంలో రెండవ స్థానం సాధించాను.

– ఎం వీరాంజనేయులు, విద్యార్థి, ఎస్వీయూ

**గర్వంగా ఉంది**



టీటీడీ శిల్ప కళాశాలలో డిగ్రీ చేస్తున్నా. సౌత్‌జోన్ పోటీలలో విజయం సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాను. కల్చరల్ కో-ఆర్డినేటర్స్ సహకారంతో ఈ స్థాయికి చేరుకోవడం గర్వంగా ఉంది. నేను ఇన్‌స్టలేషన్ విభాగంలో పాల్గొని రెండవ స్థానం సాధించా.

–మౌనిక, ఎస్వీయూ

**రెండు విభాగాల్లో సత్తా చాటాను**



ఎస్వీయూ పరిధిలోని సీకాం కళాశాలలో డిగ్రీ చదువుతున్నా. వర్సిటీ ప్రోత్సాహంతో అత్యుత్తమ శిక్షణ అందించిన అధ్యాపకులు మురళీధర్, వివేక్ సహకారం మరువలేనిది. ఇన్‌స్టలేషన్ విభాగంలో జాతీయ స్థాయిలో ద్వితీయ స్థానం, పోస్టర్ మేకింగ్‌లో మూడవ స్థానం సాధించాను.

– డీ.దేవా, విద్యార్థి, ఎస్వీయూ

**ప్రథమ స్థానం సాధించడం గర్వంగా ఉంది**



టీటీడీ శిల్ప కళాశాలలో డిగ్రీ చదువుతున్నా. దేశ వ్యాప్తంగా 2,400 మంది విద్యార్థులు 148 వర్సిటీల నుంచి యువజనోత్సవాల్లో పాల్గొన్నారు. ఇందులో క్లై మోడలింగ్ విభాగంలో ప్రథమ స్థానం కైవసం చేసుకున్నాను. ఎంతో సంతోషంగా ఉంది.

-కే.తేజ, విద్యార్థి, ఎస్వీయూ

**మెహందీలో ద్వితీయ స్థానం**



ఎస్పీడబ్ల్యూ కళాశాలలో డిగ్రీ చదువుతున్నా. జాతీయ స్థాయిలో జరిగిన పోటీలలో ఇన్‌స్టలేషన్ విభాగంలో ద్వితీయ స్థానంలో నిలిచా. మెహందీ విభాగంలో రెండవ స్థానం సాధించి ప్రశంసాపత్రం, ట్రోఫీ అందుకోవడం సంతోషంగా ఉంది.

-దీప్తి, విద్యార్థిని, ఎస్వీయూ

**ఊహించలేదు**



వర్సిటీ పరిధిలోని విజయం కళాశాలలో డిగ్రీ చదువుతున్నాను. మెహందీ, ఇన్‌స్టలేషన్ విభాగాలలో ప్రతిభ చూపి రెండవ స్థానంలో నిలవడం గర్వంగా ఉంది. ఇంతటి విజయం సాధిస్తానని అనుకోలేదు.

– సంధ్య, విద్యార్థిని, ఎస్వీయూ

# అరెస్టులు..నిరసనలు!



పుత్తూరులో అంగన్‌వాడీ వర్కర్స్‌ను అరెస్ట్ చేసిన పోలీసులు



కోట ప్రాజెక్టు వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న అంగన్‌వాడీ వర్కర్స్

**తిరుపతి అర్బన్:** అంగన్‌వాడీ వర్కర్లతో కూటమి ప్రభుత్వం చెడుగుడు ఆడుతోంది. ఇచ్చిన హామీలు అమలు చేయకపోగా.. శాంతియుతంగా ధర్నా నిర్వహించేందుకు విజయవాడకు బయలుదేరిన వారిపై ఝులుం ప్రదర్శించింది. ఎక్కడికక్కడ అరెస్టులకు పూనుకుంది. ఇది చాలదన్నట్టు హౌస్ అరెస్టులూ చేసి నరకం చూపించింది.

**సెక్టార్ సమావేశాల్లోనే నిరసన**

జిల్లాలోని 11 ఐసీడీఎస్ సెంటర్లలో సోమవారం సెక్టార్ సమావేశాలు నిర్వహించారు. సాధారణంగా సెక్టార్ సమావేశం ప్రతి నెలా 25వ తేదీ పైన నిర్వహిస్తుంటారు. కానీ విజయవాడలో సోమవారం జరిగిన మహాధర్నాకు వెళ్లకుండా కుయుక్తులు పన్నారు. సెక్టార్ సమావేశాన్ని సోమవారమే ఏర్పాటు చేశారు. జిల్లాలో 2,092 మంది అంగన్‌వాడీ వర్కర్లుండగా.. అందులో 500 మంది వరకు విజయవాడకు వెళ్లారు. మిగిలిన వారు సెక్టార్ సమావేశాల్లోనే నిరసన వ్యక్తం చేశారు.

**అండగా ఉంటామని!**

ప్రతిపక్షంలో ఉన్న సమయంలో చంద్రబాబునాయుడు, నారా లోకేష్ అంగన్‌వాడీలకు అండగా ఉంటామని హామీలిచ్చారని, ఇప్పుడు అధికారంలోకి వచ్చాక ఇలా ఇబ్బందులకు గురిచేస్తున్నారని పలువురు అంగన్‌వాడీ వర్కర్లు వాపోయారు.




తిరుమల శ్రీవారి వార్షిక తెప్పోత్సవాల్లో భాగంగా రెండో రోజు సోమవారం రుక్మిణీ సమేతంగా శ్రీకృష్ణస్వామి వారు తెప్పలపై విహరిస్తూ భక్తులకు అభయమిచ్చారు. పుష్కరిణిలో మూడుసార్లు విహరిస్తూ భక్తులను కటాక్షించారు. మూడవ రోజు శ్రీదేవి, భూదేవి సమేతంగా మలయప్పస్వామి వారు తిరుచ్చిపై విహరిస్తూ భక్తులను అనుగ్రహించనున్నారు. తిరుమల పెద్దజీయర్ స్వామి, చినజీయర్ స్వామి, టీటీడీ బోర్డు సభ్యులు శ్రీమతి పనబాకలక్ష్మి, వీజీఓ రామ్ కుమార్ పాల్గొన్నారు.

– తిరుమల

## క్లుప్తంగా

### రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


మృతి చెందిన వినోద్

**తడ:** జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి జరిగిన ప్రమాదంలో పూడి గ్రామానికి చెందిన ఇరుగళం వినోద్(24) మృతి చెందాడు. ఎస్‌ఐ కొండపనాయుడు కథనం.. పూడి గ్రామానికి చెందిన వెట్టి భాస్కర్, వినోద్ బైక్‌పై తడవైపు బయలు దేరారు. కొద్ది సేపటికే రోడ్డుపై వెళుతున్న మరో బైక్‌ను దాటే క్రమంలో అదుపు తప్పి ముందు వెళుతున్న బైక్‌ను ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో వెనుక కూర్చుని ఉన్న వినోద్ తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. దీనిపై సోమవారం పోలీసులకు ఫిర్యాదు అందడంతో కేసు నమోదు చేసి మృత దేహాన్ని సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ పోస్టు మార్టం అనంతరం బంధువులకు అప్పగించారు. కేసు దర్యాప్తులో ఉంది.

### నయా మోసం!

- క్యూఆర్ కోడ్‌పై నకిలీ స్టిక్కర్ అతికించిన వైనం


అసలు దానిపై అతికించిన నకిలీ స్టిక్కర్

**తడ:** నగదు స్కానింగ్ విషయంలో రోజుకో మోసం వెలుగులోకి వస్తోంది. తాజాగా తడలోని పలు దుకాణాల్లో కొత్త రకం మోసంతో వ్యాపారులు నష్టపోతున్నారు. ఈ ఘటన సోమవారం వెలుగులోకి వచ్చింది. బాధితుల సమాచారం మేరకు.. టీ, మాంసం దుకాణాల్లో ఫోన్‌పే, గూగుల్ పే వంటి నగదు బదిలీల కోసం ఏర్పాటు చేసిన క్యూఆర్ కోడ్ స్టిక్కర్లు షాపులు బయట అతికించి ఉంటున్నారు. ఈ క్రమంలో సోమవారం ఓ చికెన్ దుకాణం వద్ద వినియోగదారుడు నగదు బదిలీ చేసినప్పటికీ సదరు నగదు దుకాణ దారునికి చేరలేదు. దీనిపై ఆరాతీయగా అసలు స్టిక్కరుపై ఉన్న క్యూఆర్ కోడ్ వరకు కొత్తగా మరో స్టిక్కర్ ఉండడాన్ని గుర్తించారు. దుకాణ దారుడు మిగిలిన వారిని కూడా విచారించగా విషయం వెలుగులోకి వచ్చింది. దీనిపై బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. నకిలీ క్యూర్ కోడ్ ఏ బ్యాంకుతో లింక్ అయిందో తెలుసుకునేందుకు పోలీసులు బ్యాంకులను సంప్రదిస్తున్నారు.

### ఇంటర్ పరీక్షకు 375 మంది గైర్హాజరు

**తిరుపతి ఎడ్యుకేషన్:** ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షల్లో భాగంగా సోమవారం జిల్లా వ్యాప్తంగా 86 పరీక్షా కేంద్రాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ద్వితీయ సంవత్సర విద్యార్థులకు మ్యాథ్స్–2బీ, జువాలజీ, హిస్టరీ సబ్జెక్టుల్లో పరీక్షను నిర్వహించారు. ఈ పరీక్షకు జనరల్‌లో 25,107 మంది, ఒకేషనల్‌లో 1,037 మంది మొత్తం 26,144 మంది విద్యార్థులు హాజరవ్వాల్సి ఉండగా.. 375 మంది గైర్హాజరైనట్టు ఆర్‌ఐఓ జీవీ.ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. ఈ పరీక్షల్లో భాగంగా మంగళవారం ప్రథమ సంవత్సర విద్యార్థులకు ఫిజిక్స్, ఎకనామిక్స్ సబ్జెక్టుల్లో జిల్లా వ్యాప్తంగా 86పరీక్షా కేంద్రాల్లో పరీక్ష నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

# నీ శరణిదే జొచ్చితిని!

### సంగీత తపస్వి గరిమెళ్ల

- అన్నమయ్య సంకీర్తనలే జీవితం
- రాగాలద్ది.. వైవిధ్యభరితంగా జనబాహుళ్యంలోకి
- భిన్నస్వరాలతో బాణీలు
- ఆయన లేని లోటు తీర్చలేనిదంటున్న సంగీత ప్రియులు


దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్.రాజశేఖర్‌రెడ్డి చేతుల మీదుగా పురస్కారం అందుకుంటున్న గరిమెళ్ల బాలకృష్ణప్రసాద్ (ఫైల్)


టీటీడీ ఆస్థాన విద్వాంసుడు గరిమెళ్ల బాలకృష్ణప్రసాద్ పార్థివ దేహం


గరిమెళ్ల బాలకృష్ణప్రసాద్ (ఫైల్)


తన గురువు విద్వాన్ నేదునూరి కృష్ణమూర్తితో గరిమెళ్ల బాలకృష్ణ ప్రసాద్ (ఫైల్)

**తిరుపతి కల్చరల్:** సంగీత తపస్వి గరిమెళ్ల బాలకృష్ణ ప్రసాద్. ఆయన ఆధ్యాత్మికత సుపరిమళ గుబాళింపుగా ప్రాశస్తి చెందిన అన్నమయ్య సంకీర్తనలనే జీవితంగా మలుచుకున్నారు. తన స్వర కీర్తనలతో అలరారింపజేశారు. రాగాలనద్ది, వైవిధ్యభరితంగా బాణీలు కట్టారు. భిన్నమైన స్వర ప్రయోగాలతో సాహిత్య అభిమానులను సంగీత సాగరంలో ముంచెత్తారు.

**తుది శ్వాస వరకు..**

గరిమెళ్ల భార్య రాధ. ఆయన కుమారులు అనిల్ కుమార్, పవన్ కుమార్. నిత్య సంగీతార్చనతో తన ఆధ్యాత్మిక భక్తి పారవశాన్ని చాటుకున్నారు. తుది శ్వాస వరకు సంగీతోపాన్యాసం చేస్తూ నాద యోగిగా గుర్తింపు తెచ్చుకున్నారు.

**వైవిధ్య బాణీలు**

రాగమే ధ్యాసగా.. ఆధ్యాత్మిక సంగీతమే జీవితంగా పయనిస్తూ వెయ్యికి పైగా అన్నమాచార్య సంకీర్తనలను పండిత పామర జనరంజకంగా శాస్త్రీయ లలిత, జానపద బాణీలలో స్వరపరిచారు. అన్నమయ్య కీర్తనల సాహిత్య పరిమళాలను విస్తరింపజేశారు. బహుళ ప్రచారంలో మోహన, హంసధ్వని, శంకరాభరణం, తోడి, కల్యాణి, మాయామాళవగౌళ రాగాలను సరళమైన పద్ధతిలో స్వరపరిచారు. అన్నమాచార్య సంకీర్తనలను భావయుక్తంగా తన గళంలో పలికించేందుకు వీలుగా ఆయా సంకీర్తనలలోని సాహిత్యాన్ని కూలంకషంగా అధ్యయనం చేసి దానికి తగిన రాగాలను స్వరబాణీలను సమకూర్చారు. అంతేగాక రతిపతిప్రియ, వరం, నటహిందోళం, శివరంజని, పాడి, మిశ్రవకుళాభరణం వంటి రాగాల్లో ఆయన స్వర పరిచన సంకీర్తనలు అలరింపజేశాయి. సుందరంజని, సుమశ్రీసుకామవర్ధని, సుమగంధి, సునాదనంది, సత్యప్రియ, సంజీవి, సింధుప్రియ, శ్యామకాంభోజి ,వాణీప్రియ, చిత్రకల్యాణి, నిషాది, ప్రసూన, కోమలి వంటి సుమారు 20 అపూర్వ రాగాలను సృష్టించి అందులో కీర్తనలను రచించి పుస్తకాలుగా, ఆడియో రూపంలో తీసుకువచ్చారు. ప్రపంచ వ్యాప్తంగా సప్తగిరి సంకీర్తనల గోష్టి గానాన్ని ప్రచారం చేసిన ఘనత గరిమెళ్లకే దక్కింది.

**విశేష పురస్కారాలు**

గరిమెళ్ల చేసిన సంగీత యజ్ఞ ప్రతిభకు విశేష పురస్కారాలు వరించాయి. అన్నమాచార్య సంకీర్తన మహతి, హరికీర్తనాచార్యులతో పాటు ప్రభుత్వ, ప్రయివేటు ఆధ్యాతిక సంస్థల పురస్కార సత్కారాలు అందుకున్నారు. శ్రీపద్మావతి మహిళా వర్సిటీ నుంచి డాక్టరేట్ డిగ్రీ అందుకున్నారు. శ్రీపొట్టి శ్రీరాముల తెలుగు వర్సిటీ నుంచి విశిష్ట పుస్కారంతో పాటు రాష్ట్రపతి చేతుల మీదుగా కేంద్ర సంగీత నాటక అకాడమీ పురస్కారం అందుకున్నారు.

**స్వరం మాధుర్యం..ప్రతిభ అపారం**

సంగీత కళానిధి నేదునూరి కృష్ణమూర్తి శిష్యరికంతో గరిమెళ్ల బాలకృష్ణ ప్రసాద్ మరింత రాటుతేలారు. శాస్త్రీయ, ఆధ్యాత్మిక గాయకుడుగా గరిమెళ్ల 1978లో అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారుడుగా ప్రవేశించారు. అపార ప్రతిభతో టీటీడీ ఆస్థాన విద్యాంసుడుగా ఎదిగారు. టీటీడీ ఆస్థాన పండితుడుగా అన్నమయ్య కీర్తనలను స్వపరపరిచి ఆలపించారు. తిరుమల శ్రీవేంకటేశ్వరునికి సంకీర్తన నైవైద్యాన్ని సమర్పించారు. రాజమండ్రిలో 1946 నవంబర్ 9వ తేదీన కృష్ణవేణి, నరసింహరావు దంపతులకు జన్మించారు. ఆయన తండ్రి నరసింహరావు విద్యాంసుడు. ప్రముఖ సినీ గాయని జానకి స్వయాన పిన్నమ్మ కావడంతో చిన్నప్పటి నుంచి ఆయన సంగీతం పట్ల ఆసక్తితో అంచెలంచెలుగా ఎదిగారు. చివరి దశలో తిరుపతిలో స్థిరపడ్డారు.


తన పిన్ని, ప్రముఖ సినీ గాయని జానకితో గరిమెళ్ల బాలకృష్ణ ప్రసాద్ (ఫైల్)

**కళా నీరాజనం**

గరిమెళ్ల బాలకృష్ణప్రసాద్‌కు పలువురు ప్రముఖులు, కళాకారులు సోమవారం నివాళి అర్పించారు. ఇందులో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ చింతామోహన్, బ్రాహ్మణ సమాజం ప్రతినిధులు, రాయలసీమ రంగస్థలి కళాకారులు, టీటీడీ అన్నదానం డెప్యూటీ ఈవో రాజేంద్రకుమార్, డీపీపీ కార్యదర్శి, అన్నమయ్య వంశీయులు హరినారాయణదాస, ఎస్వీ సంగీత కళాశాల అధ్యాపకులు, అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులు ఉన్నారు.

## పరీక్షల ఒత్తిడి తట్టుకోలేక..

- విద్యార్థినుల మిస్సింగ్ కేసును ఛేదించిన పోలీసులు


వివరాలను వెల్లడిస్తున్న గూడూరు డీఎస్పీ గీతాకుమారి

**వెంకటగిరి రూరల్:** పరీక్షల ఒత్తిడి తట్టుకోలేక హాస్టల్ నుంచి పరారైన విద్యార్థినుల మిస్సింగ్ కేసును పోలీసులు ఛేదించిన ఘటన సోమవారం వెంకటగిరి పట్టణంలో చోటు చేసుకుంది. గూడూరు డీఎస్పీ గీతాకుమారి కథనం..స్థానిక బాలికోన్నత పాఠశాలలో చదువుతూ స్థానికంగా ఉన్న ఎస్సీ హాస్టల్‌కు చెందిన బాలికలు ముగ్గురు ఆదివారం హాస్టల్ నుంచి పారిపోయారు. విషయం తెలుసుకున్న వెంకటగిరి సీఐ ఏవీ రమణ నేతృత్వంలో వెంకటగిరి, బాలాయపల్లి, డక్కిలి ఎస్‌ఐలతో కూడిన మూడు బృందాలు సోషల్ వెల్ఫేర్ డైరెక్టర్ విక్రమ్, ఎస్‌డీపీ నాయుడుపేట పర్యవేక్షణలో ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు. మొదటగా విద్యార్థినులు ఆర్టీసీ బస్సు ఎక్కి నాయుడుపేటకు చేరుకుని అక్కడి నుంచి తిరుపతికి వెళ్లినట్టు సీసీ టీవీ ఫుటేజ్ ఆధారంగా ధ్రువీకరించారు. ఈ మేరకు సోమవారం తెల్లవారు జామున ఆ ముగ్గురు విద్యార్థినులను తిరుపతిలో అదుపులోకి తీసుకున్నారు. పరీక్షల ఈనెల 17వ తేదీన జరగనున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షల ఒత్తిడి కారణంగా వారు హాస్టల్ నుంచి పారిపోయినట్టు డీఎస్పీ తెలిపారు. సీఐ ఏవీ రమణ, ఎస్‌ఐలు సుబ్బారావు, భవాని, శివశంకర్, సీడీపీఓ శంషాద్‌బేగం పాల్గొన్నారు.

## సీసీ కెమెరాలతో నిఘా


నాయుడుపేట అర్బన్ సర్కిల్ కార్యాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పీ హర్షవర్ధన్ రాజు

**నాయుడుపేట టౌన్:** నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలను ఏర్పాటు చేయించి కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని ఎస్పీ హర్షవర్ధన్ రాజు సిబ్బందిని ఆదేశించారు. నాయుడుపేట పోలీస్ డివిజన్ కార్యాలయం, అర్బన్, రూరల్ పోలీస్ సర్కిల్ కార్యాలయాలను ఆయన సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం ఎస్పీ విలేకరులతో మాట్లాడుతూ ఫిర్యాదుదారులతో గౌరవ ప్రదంగా వ్యవహరించాలన్నారు. మహిళలు వివిధ సమస్యలపై పోలీస్ స్టేషన్లకు వస్తే తక్షణం స్పందించాలని చెప్పారు. జిల్లాలో గంజాయి అక్రమ రవాణాలకు అడ్డుకట్ట వేసేలా ఈగల్ టీం ఏర్పాటు చేసినట్టు తెలిపారు. డీఎస్పీ చెంచుబాబు, సీఐలు బాబి, సంగమేశ్వర రావు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

## శ్రీవారి సేవలో చదరంగం క్రీడాకారుడు


భారత చదరంగం క్రీడాకారుడు డీ.గుకేష్

**తిరుమల:** తిరుమల శ్రీవారిని సోమవారం మంత్రి నారాయణ, స్పీకర్ కోన రఘుపతి, భారత చదరంగం క్రీడాకారుడు డీ.గుకేష్ దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనానంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించగా.. టీటీడీ అధికారులు ఘనంగా లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు.

## ప్రమాదానికి కారణమైన ట్రాక్టర్ సీజ్


పోలీస్ స్టేషన్‌లో ప్రమాదానికి కారణమైన ట్రాక్టర్

**చంద్రగిరి:** ట్రాక్టర్ ఢీకొని యువకుడు మృతి చెందిన ఘటనలో ఎట్టకేలకు పోలీసులు ట్రాక్టర్‌ను సీజ్ చేసి స్టేషన్‌కు తరలించారు. రెండు రోజుల క్రితం చంద్రగిరి ఇందిరమ్మ కాలనీ సమీపంలో జరిగిన ప్రమాదంలో బైక్‌పై వెళ్తున్న చాణక్య అనే యువకుడు మృతి చెందిన విషయం తెలిసిందే. అయితే ప్రమాదానికి కారణమైన ట్రాక్టర్ అధికార పార్టీ నేతకు చెందినది కావడంతో దాన్ని తప్పించేందుకు టీడీపీ నేతలు పోలీసులపై తీవ్రంగా ఒత్తిడి తెచ్చారు. ఈ క్రమంలో ట్రాక్టర్‌ను సీజ్ చేయడంలో పోలీసులు వెనుకంజ వేశారు. ఈ విషయం సోషల్ మీడియాలో వైరల్ కావడంతో చేసేది లేక పోలీసులు ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్టు సమాచారం.

## రాష్ట్ర స్థాయి హాకీ పోటీల్లో జిల్లా జట్టు విజయం


ట్రోఫీ అందుకుంటున్న తిరుపతి జిల్లా సీనియర్ మెన్ హాకీ జట్టు క్రీడాకారులు, నిర్వాహకులు

**తిరుపతి ఎడ్యుకేషన్ :** గుంటూరు ఏఎన్‌యూలో ఈ నెల 6 నుంచి 10వ తేదీ వరకు రాష్ట్ర స్థాయి సీనియర్ మెన్ హాకీ పోటీలు నిర్వహించారు. ఇందులో భాగంగా సోమవారం ప్రతిభ కనబరిచిన తిరుపతి, సత్యసాయి జిల్లా జట్లు ఫైనల్‌కు చేరాయి. హోరాహోరీగా తలపడ్డ ఫైనల్ పోటీల్లో సత్యసాయి జిల్లా జట్టుపై 6–2గోల్స్ తేడాతో తిరుపతి జిల్లా జట్టు విజయం సాధించినట్టు ఏపీ హాకీ సంఘం ప్రధాన కార్యదర్శి హర్షవర్ధన్, ఏపీ హాకీ డైరెక్టర్ నిరంజన్‌రెడ్డి చేతుల మీదుగా ట్రోఫీని అందుకుంది. ఈ పోటీల్లో తిరుపతి జిల్లా జట్టు బ్యాక్ క్రీడాకారుడు శ్రీనివాసులురెడ్డి(చంద్రగిరి), సెంటర్ హాఫ్ క్రీడాకారుడు సందీప్(గూడూరు) ఓవరాల్ ప్రతిభ కనబరిచి బెస్ట్ ప్లేయర్స్ అవార్డులను అందుకున్నారు. ప్రతిభ కనబరచిన జిల్లా జట్టు, క్రీడాకారులను జిల్లా హాకీ జట్టు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు స్వర్ధన్‌రాజు, బీ.ఆదిత్య, కోచ్‌లు దీపక్ ఆకాష్, అశోక్, రమేష్, జెర్సీ స్పాన్సర్లు వీఎస్ మొబైల్స్ అప్పు, వెంకట్ అభినందించారు.

## పోలీస్ గ్రీవెన్స్‌కు 102 అర్జీలు

**తిరుపతి క్రైం:** తిరుపతి జిల్లా ఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికకు 102 ఫిర్యాదులు అందినట్టు ఎస్పీ హర్షవర్ధన్‌రాజు తెలిపారు. ఇందులో దొంగతనాలు, ఆస్తి తగాదాలు, ఆర్థికపరమైన లావాదేవీలు ఉన్నాయన్నారు. వెంటనే సంబంధిత అర్జీలు పరిష్కరించాలని సిబ్బందిని ఆదేశించారు.

## ముగిసిన జాతీయ సదస్సు


అతిథులను సన్మానిస్తున్న వర్సిటీ అధికారులు

**తిరుపతి సిటీ:** కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన నూతన జాతీయ విద్యా విధానం (ఎన్‌ఈపీ)–2020పై జాతీయ సంస్కృత వర్సిటీ వేదికగా గత రెండు రోజులుగా జరిగిన జాతీయ సదస్సు సోమవారం ముగిసింది. ఈ కార్యక్రమానికి కేంద్ర సంస్కృత వర్సిటీ వీసీ శ్రీనివాస వర్కేడి, లాల్ బహదూర్ శాస్త్రి సంస్కృత వర్సిటీ వీసీ మురళీమనోహర్ పాఠక్, ఎస్ఎస్‌యూ వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి ముఖ్యఅతిథులుగా పాల్గొని ప్రసంగించారు. అనంతరం వర్సిటీ అధికారులు అతిథులను జ్ఞాపికలతో సత్కరించారు. రాష్ట్రపతి సన్మాన గ్రహీత, మాజీ అకడమిక్ డీన్ కొంపెల్ల రామసూర్య నారాయణ, వర్సిటీ వీసీ లక్ష్మీశ్రీనివాస్ పాండే, పలు వర్సిటీల మాజీ వీసీలు పరమేశ్వరనారాయణశాస్త్రి, అర్కనాథ చౌదరీ, సంస్కృత సంవర్ధన ప్రతిష్టానం డైరెక్టర్ చాంద్ కిరణ్ సలూజా పాల్గొన్నారు.

## మహిళ అరెస్ట్

–3 కిలోల గంజాయి స్వాధీనం

**నాయుడుపేట టౌన్:** మండల పరిధిలోని కోనేటి రాజుపాళెం గ్రామంలో గంజాయి విక్రయిస్తున్న పిట్ల చిన్ని అనే మహిళను పట్టుకున్నట్లు సీఐ తెలిపారు. గ్రామ సెంటర్‌లో గంజాయి విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో ఎస్‌ఐ ఆదిలక్ష్మి పోలీస్ సిబ్బందితో వెళ్లి మహిళలను అరెస్ట్ చేసి, ఆమె వద్ద ఉన్న 3 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్టు వెల్లడించారు.

## శ్రీరామలో ప్రాంగణ ఎంపికలు


ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో కళాశాల సిబ్బంది, అధ్యాపకులు

**తిరుపతి సిటీ:** స్థానిక కరకంబాడి రోడ్డులోని శ్రీరామ ఇంజినీరింగ్ కాలేజ్‌లో హైదరాబాద్‌కు చెందిన గ్లోబల్ లాజిక్ బహుళజాతి కంపెనీ వారి ఆధ్వర్యంలో కళాశాల ఆఖరి సంవత్సరం విద్యార్థులకు ప్రాంగణ ఎంపికలు నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థులకు రాత పరీక్ష, గ్రూప్ డిస్కషన్, టెక్నికల్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. కళాశాలకు చెందిన 37 మంది విద్యార్థులకు రూ.3లక్షల వార్షిక వేతనంతో ఎంపిక చేశారు. ఎంపికైన విద్యార్థులను కళాశాల చైర్మన్ మన్నెం రామిరెడ్డి అభినందించారు. కళాశాల డైరెక్టర్స్ మన్నెం రామసుబ్బారెడ్డి, మన్నెం అరవిందుకుమార్ రెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ జయచంద్ర, కంపెనీ ప్రతినిధి దీప్తి, ప్లేస్మెంట్ ఆఫీసర్ విష్ణువర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

## ఆ కేసును ఏసీబీ కోర్టుకు బదిలీ చేయండి

**తిరుపతి లీగల్:** తిరుమలకు కల్తీ నెయ్యి తరలిస్తున్నారన్న అభియోగం కింద నమోదైన కేసు విచారణను ఏసీబీ కోర్టుకు తరలించాలని సిట్ అధికారులు సోమవారం తిరుపతి రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో పిటిషన్ దాఖలు చేసినట్టు తెలిసింది. ప్రస్తుతం కేసు విచారణ జరుగుతున్న తిరుపతి రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు పరిధిలోకి కేసు రాదని ఆ పిటిషన్‌లో పేర్కొన్నట్టు తెలిసింది. కేసు విచారణ ఏసీబీ కోర్టు మాత్రమే చేపట్టాలని అధికారులు ఆ పిటిషన్‌లో కోర్టును కోరినట్టు సమాచారం. దీనిపై న్యాయమూర్తి కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌ను వివరణ కోరగా.. ఆ పిటిషన్ దాఖలుపై తనకు సమాచారం లేదని న్యాయమూర్తికి తెలిపారు. దీంతో న్యాయమూర్తి ఆ పిటిషన్ పై తీర్పును రిజర్వులో ఉంచారు.

## రైతు ఆత్మహత్యాయత్నం

**బాలాయపల్లి(సైదాపురం):** బాలాయపల్లి మండలం, కాట్రగుంట పంచాయతీ, కరిమినగుంట గ్రామానికి చెందిన రైతు పాటూరు గోపాలయ్య పురుగులు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. కుటుంబ సభ్యుల వివరాలు .. కరిమినగుంట గ్రామ సర్వే నం.21.9లో పాటూరు గోపాలయ్యకు 48 సెంట్ల భూమి ఉందన్నారు. ఈ భూమిని అదే గ్రామానికి చెందిన రాఘవయ్య సంతకాలు ఫోర్జరీ చేసి పొలాన్ని రఘురామయ్య పేరుపై రికార్డుల్లో ఎక్కించే ప్రయత్నం చేస్తున్నట్టు ఆరోపించారు. దీంతో మనస్తాపానికి చెందిన గోపాలయ్య ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్టు వెల్లడించారు. ఈ పొలం విషయమై గత రెండేళ్లుగా కోర్టులో వివాదం నడుస్తోంది.



## శ్రీవారి దర్శనానికి 12 గంటలు

**తిరుమల:** తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో పది కంపార్ట్‌మెంట్లు నిండాయి. గురువారం అర్ధరాత్రి వరకు 79,478 మంది స్వామివారిని దర్శించుకోగా 26,667 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.4.05 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 12 గంటల్లో దర్శనం లభిస్తోంది.

## 62 మొబైల్ ఫోన్లు స్వాధీనం

**రేణిగుంట(శ్రీకాళహస్తి రూరల్):** రేణిగుంట రైల్వే స్టేషన్ పరిధిలో గత ఏడాది నవంబర్ 15వ తేదీకి ముందు చోరీ అయిన మొబైల్ ఫోన్ల ముఠాను రేణిగుంట జీఆర్‌పీ పోలీసులు పట్టుకుని వారి నుంచి 62 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్టు జీఆర్‌పీ ఎస్‌ఐ రవి తెలిపారు. ఈ మేరకు రేణిగుంట రైల్వే స్టేషన్‌లో ఫోన్లు పోగొట్టుకున్న వారు తమ మొబైల్ ఐఎంఈఐ నంబర్లు, ఫోన్ కొనుగోలు రసీదులు, ఐడీ ప్రూఫ్‌లు తీసుకుని రేణిగుంట జీఆర్‌పీ స్టేషన్లో సంప్రదించాలని కోరారు. వివరాలకు రేణిగుంట జీఆర్‌పీ ఎస్‌ఐ రవి 9963126343 నంబరుకు ఫోన్ చేసి సంప్రదించాలని సూచించారు.

## హత్య కేసులో వ్యక్తి అరెస్ట్

**తిరుపతి క్రైం:** డబ్బులు ఇవ్వలేదన్న కోపంతో మహిళను చంపిన వ్యక్తిని అరెస్టు చేసినట్లు తిరుపతి వెస్ట్ సీఐ మురళీ మోహన్‌రావు తెలిపారు. వివరాలు.. తిరుపతి నగరంలోని చిన్నగుంటకు చెందిన టీ.గోపాల్‌రెడ్డి భార్య ప్రమీల(53) ఇంట్లో ఉండగా ఈ నెల 7వ తేదీ బానోత్ రవినాయక్ (39)డబ్బులు ఇవ్వాలని అడిగాడు. ఆమె ఇవ్వకపోవడంతో గొంతు నులిమి చంపేసి పారిపోయాడు. ప్రమీల కొడుకు నవీన్ ఫిర్యాదు మేరకు వెస్ట్ పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితుడు సోమవారం వేదిక్ యునివర్సిటీ దగ్గర ఉండగా.. వెస్ట్ సీఐ ఆధ్వర్యంలో పట్టుకున్నట్లు తెలిపారు. నిందితున్ని రిమండ్‌కు తరలించినట్లు తెలిపారు. ఎస్ఐ అనిల్‌కుమార్, ఏఎస్ఐ వెంకటరత్నం, హెడ్ కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.



# కలెక్టరేట్‌కు పోటెత్తిన అర్జీదారులు


బైరాగిపట్టెడిలో మద్యం షాపును తొలగించాలంటున్న స్థానికులు


వరిధాన్యం కొనుగోలు చేయడంలో న్యాయం చేయాలంటూ కలెక్టర్‌కు వరి కంకెలు ఇస్తున్న రైతులు


చంటి బిడ్డలతో వచ్చి.. అర్జీలు రాసుకుంటూ..



కలెక్టరేట్‌కు వచ్చి మెట్లు దిగలేక ఆపసోపాలు పడుతున్న దివ్యాంగులు

**తిరుపతి అర్బన్:** కలెక్టరేట్‌కు అర్జీదారులు పోటెత్తారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన గ్రీవెన్స్‌కు కలెక్టర్ వెంకటేశ్వర్‌తోపాటు డీఆర్వో నరసింహులు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు దేవేంద్రరెడ్డి, రోజ్‌మాండ్‌తో కలిసి అధికారులు అర్జీలు స్వీకరించారు. జిల్లా నలుమూలల నుంచి మొత్తం 265 అర్జీలు రాగా.. అందులో 172 అర్జీలు రెవెన్యూ సమస్యలపైనే వచ్చినట్టు అధికారులు పేర్కొన్నారు.

**సమస్యలే సమస్యలు**

- గిరిజన యానాది కాలనీల్లో పలువురు పిల్లలతోపాటు పెద్దలకు ఆధార్‌కార్డులు లేవని ఏపీ యానాది సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ బీఎల్ శేఖర్, జిల్లా కన్వీనర్ శ్రీనివాసరావు కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు.
- కేవీబీపురం మండలం, ఎస్ఎల్‌పురం గ్రామంలోని స్కూల్‌లో 3, 4, 5 తరగతుల విద్యార్థులను 2.5 కి.మీ దూరంలోని పాఠశాలకు వెళ్లాల్సి వస్తోందని, వారిని కళత్తూరు పాఠశాలకు మార్పు చేయాలని కోరారు. పలువురికి ఇంటి పట్టాలిచ్చినా స్థలాలు చూపించలేదన్నారు.
- బైరాగిపట్టెడిలోని మద్యం షాపును మరోచోటుకు మార్పు చేయాలని పలువురు కలెక్టర్‌కు వినతిపత్రాన్ని ఇచ్చారు.
- అవిలాల చెరువును రక్షించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మురళి కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందించారు.
- వరి ధాన్యానికి గిట్టుబాటు ధర పెంచాలని పలువురు రైతులు కోరారు. అలాగే సకాలంలో బిల్లులు ఇవ్వాలన్నారు.